'గులాబీ' తోటలో 'ఆత్మీయ' సంబురం


పరిగి: బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


తాండూర్ టౌన్: 9వ వార్డులో వేడుకలో వైస్ చైర్‌పర్సన్ దీప, నాయకులు


బొంరాస్‌పేట: చౌదర్‌పల్లిలో బీఆర్‌ఎస్ జెండావిష్కరణలో నేతలు

బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు మంగళవారం గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వాడవాడలా బీఆర్‌ఎస్ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన టీఆర్‌ఎస్ పార్టీ నేడు అంచెలంచెలుగా ఎదిగి బీఆర్‌ఎస్ పార్టీగా అవతరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో దేశమంతటా బీఆర్‌ఎస్ పార్టీ తన సత్తా చాటుతుందన్నారు. – సాక్షి, నెట్‌వర్క్


పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో..


తాండూరు రూరల్: కోటబాసుపల్లిలో బీఆర్‌ఎస్ జెండావిష్కరణ



దోమ: బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు రాజిరెడ్డి


బషీరాబాద్: ఎంపీటీసీ వడ్డే శ్రీనివాస్ ఆధ్వర్యంలో..


కుల్కచర్ల: బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

క్లుప్తంగా

పుస్తెమట్టెలు అందజేత


యువతికి పుస్తెమట్టెలను అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కుల్కచర్ల: నిరుపేద యువతుల పెళ్లిళ్లకు తమ వంతు సహాయం అందిస్తామని వాసవీ క్లబ్ నిర్వాహకులు స్వేత, వాసు అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన జ్యోతి వివాహానికి పుస్తెమట్టలు, నగదును అందజేశారు. శివ బిల్డర్స్, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజల పెళ్లిళ్లకు తమవంతుగా సహాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, మహేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో కంటివెలుగు శిబిరం


వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్: తాండూర్ మున్సిపాలిటీ 27వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న మంగళవారం ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న పలువురికి కళ్లద్దాలు, మందులను అందజేశారు. శిబిరాలను సద్వినియోంగ చేసుకోవాలన్నారు. కౌన్సిలర్లు అబ్దుల్ రజాక్, నీరజాబాల్‌రెడ్డి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

కరెంటు ఫెన్సింగ్ ఉపయోగిస్తే చర్యలు: సీఐ

మోమిన్‌పేట: అడవిపందుల నుంచి పంటలను రక్షించుకునేందుకు పొలం చుట్టూ కరెంటు ఫెన్సింగ్‌ను ఉపయోగించవద్దని సీఐ వెంకటేశం తెలిపారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని రాళ్లగుడుపల్లిలో ఆ గ్రామ రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పంటలను అడవిపందుల నుంచి కాపాడుకునేందుకు కరెంటు ఫెన్సింగ్ ఉపయోగించే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కరెంటు ఫెన్సింగ్ ఉపయోగించడం వలన రైతులు, పశువులకు ప్రాణహాని ఉంటుందని అన్నారు. గతంలో చాలామంది కరెంటు షాక్‌తో మరణించినట్లు తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు ఇతర మార్గాలను అనుసరించాలని సూచించారు. ఎవరైనా కరెంట్ ఫెన్సింగ్ ఉపయోగిస్తే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్, పోలీసు సిబ్బంది, సర్పంచ్ సావిత్రమ్మ, రైతులు ఉన్నారు.

ఘనంగా రామానుజ జయంతి

కొడంగల్: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ రామానుజ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేసి రామానుజ మూర్తికి పట్టు వస్త్రాలు, పూలమాలతో అలంకరణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొనసాగుతున్న సత్యసాయి ఆరాధనోత్సవాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ సత్య సాయి జ్ఞాన కేంద్రంలో మంగళవారం సత్య సాయి బాబా ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం ఓంకారం, భజన సంకీర్తన, ఆధ్యాత్మిక సందేశం, మహా మంగళహారతి ఇచ్చారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఆధ్యాత్మిక సమన్వయకర్త బందెయ్యగౌడ్ మాట్లాడుతూ.. భగవాన్ సత్యసాయి బోధనలైన సత్య ధర్మశాంతి, ప్రేమ, అహింస సాధనతో ప్రపంచ శాంతికై అందరం కృషి చేయాలన్నారు. విద్య, వైద్యం, నీరు మౌలిక వసతుల కల్పనలో సత్యసాయి బాబా లక్షల మందికి సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సత్యనారాయణగౌడ్, సభ్యులు సత్యకుమార్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలమయం


రాంపూర్‌గేటు వద్ద రోడ్డుపై గుంతలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని ప్రధాన రోడ్లు గుంతలమయమయ్యాయి. అల్లాపూర్ గేటు నుంచి కోత్లాపూర్ వరకు రోడ్డుపై పదుల సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. రాంపూర్ సమీపంలోని అల్‌మాస్ స్కూల్ వద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయాల్లో వాహనదారులకు గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

29న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, నాయకులు

కొడంగల్ రూరల్: దౌల్తాబాద్ మండలంలోని మాటూర్ గ్రామంలో ఈనెల 29న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని అంబేడ్కర్ ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం కొడంగల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ చేయూత ఏసీఎఫ్ చైర్మన్ అశోక్‌కుమార్, స్వేరో సర్కిల్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘాల నాయకులు చిన్నికృష్ణ, శ్యాంసుందర్, జగన్, కృష్ణ, హన్మంతు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కుక్కింద-అవుసుపల్లి గ్రామాల మధ్యన నల్లమడి రోడ్డు మలుపులో ఉన్న కల్వర్టు దిమ్మెలు ఊడిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. దిమ్మెలను పునఃనిర్మించాలని పలుమార్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ధారూరు-కుక్కింద గ్రామల మధ్యన రూ.1.32 కోట్లతో కొత్తగా నిర్మించిన రీబీటితో వాహనాలన్ని వేగంగా వెళ్తున్నాయని..


నల్లమడివాగు సమీపంలో దిమ్మెలు లేని కల్వర్టు

వీటిలో ఏ ఒక్క దానికి ప్రమాదం జరిగిన ప్రాణ నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కల్వర్టుకు ఇరువైపులా దిమ్మెలను నిర్మించి ప్రమాదాలు జరుగకుండా నివారించాలని వారు కోరారు.

'సీఈఐఆర్'ను సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి



ఫిర్యాదుదారుడికి మొబైల్‌ను అందజేస్తున్న సీఐ రాజేందర్ రెడ్డి

తాండూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) విధానం ద్వారా పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్ దొరికే అవకాశం ఉందని తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తాండూర్ పీఎస్‌లో మాట్లాడుతూ.. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్‌ను గుర్తించేందుకు వినియోగదారులు నేరుగా కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి మొబైల్ ఐఎంఈఐ నంబర్, కంపెనీ పేరు, మోడల్, కొనుగోలు చేసిన బిల్లు వివరాలను పొందుపరచాలన్నారు. ఇందులో మొదట మొబైల్‌ను బ్లాక్ చేయవచ్చన్నారు. మొబైల్ పోయిన వెంటనే దగ్గర్లోని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే అక్కడి సిబ్బంది వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలను నమోదు చేస్తారన్నారు. మొబైల్ దొరికిన తర్వాత విధిగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి అన్‌బ్లాక్ ఆప్షన్‌ను క్లిక్ చేసినట్లయితే ఫోన్ పనిచేస్తుందన్నారు. మే 17వ తేదీ ప్రపంచ టెలికాం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన మొబైల్ పోగొట్టుకున్న ఆంజనేయులు అనే వ్యక్తి మొబైల్‌ను వారం రోజుల్లోనే ట్రేస్ చేసినట్లు సీఐ చెప్పారు. ఈమేరకు మంగళవారం సంబంధిత వ్యక్తికి మొబైల్ ఫోన్‌ను అందజేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కుల్కచర్ల: టీడీపీతోనే పేద ప్రజల అభ్యున్నతి సాధ్యమని చౌడాపూర్ మండల టీడీపీ మండల అధ్యక్షుడు మాసయ్య అన్నారు. మంగళవారం చౌడాపూర్ గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. భవిష్యత్‌లో టీడీపీకి పూర్వవైభవం రావడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఏపీలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన కార్యక్రమాలపైకరపత్రాలతో ప్రచారం చేపట్టారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'అథ్లెటిక్స్'లో సత్తాచాటిన విద్యార్థులకు సత్కారం

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం రాత్రి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన విద్యార్థులకు ఈ సందర్భంగా బంగారు, వెండి పథకాలతో గ్రామ సర్పంచ్ చ్రంమౌలి సత్కరించారు. సెమీ ఒలంపియాడ్ జాతీయ స్థాయి టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల కరెస్పాండెంట్ మధు, డైరెక్టర్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వైఎస్ షర్మిల అరెస్టును ఖండిస్తున్నాం

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదయ్య

పరిగి: నిరుద్యోగుల పక్షన పోరాటం చేస్తున్న వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల అరెస్టును ఖండిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదయ్య అన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్ లీక్‌లపై దర్యాప్తు చేస్తున్న సిట్ కార్యాలయానికి మంగళవారం వైఎస్ షర్మిల వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం దారుణమన్నారు. దీనికి నిరసనగా పరిగి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.84వేలు పలికిన తైబజార్

కుల్కచర్ల: గ్రామాబివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో మంగళవారం తైబజార్ వేలాన్ని నిర్వహించారు. ముసలి వెంకటయ్య రూ.84వేలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. తైబజార్ వేలం డబ్బులతో గ్రామాభివృద్ధికి అవసరమయ్యే పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రభూపాల్, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

కుల్కచర్ల: ఉపాధిహామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఘనపూర్ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల పరిధిలోని ఘనపూర్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. వ్యవసాయ పనులకు ఉపయోగకరంగా ఉండే విధంగా ఉపాధి పనులు నిర్వహించాలన్నారు. రైతుల పొలాలకు బాటలు వేయడం, పొలాలను లెవలింగ్ చేయడం, పొలాలకు నీరు నిల్వ ఉండేలా గుంతలను తవ్వడం వంటి పనులు చేపట్టాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇచ్చి ఉపాధి పనులను కల్పించాలన్నారు. కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య, పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్, రైతులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

పఠన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఎంఈఓ హరిశ్చందర్



వేసవి పఠన శిబిరంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరిగి: విద్యార్థుల అభ్యాసనాన్ని మెరుగుపరచుకోవడానికి వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నస్కల్ ప్రాథమిక పాఠశాలలో వేసవి పఠన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు పలు అంశాలపై ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. విద్యార్థులకు ఆటపాటలతో పాటు కథలతో కూడిన పాఠ్యాంశాలను బోధిస్తారన్నారు. తెలుగు, ఇంగ్లిష్‌లో పఠన సామర్థ్యం పెంచేందుకు కృషిచేస్తామన్నారు. గణితంలో ప్రాథమిక విషయాలు, చిత్రలేఖనం, పాటలు, నృత్యాలు విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా నేర్పిస్తారన్నారు. విద్యార్థులు వేసవి శిబిరంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంపూర్ణ, ప్రధానోపాధ్యాయులు పాండు, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రభుత్వ అణచివేతపై ఆర్టిజన్‌ల ఫైర్

తాండూరు: ఆర్టిజన్‌ల సమ్మెకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో మంగళవారం తాండూర్ పట్టణ శివారులోని భూకైలాస్ దేవాలయం వద్ద ఆర్టిజన్‌లు తమ నిరసన తెలిపారు. డివిజన్ పరిధిలో ఉన్న ఆర్టిజన్ కార్మికులు ఈ నిరసన సభకు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు.. తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కార్మికులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. అనుమతి లేకున్నా సమ్మె చేపట్టడంలో ప్రధాన పాత్ర పోషించిన 6 మందిపై కేసు నమోదు చేశారు.

హామీలను నెరవేర్చాలి..

అనంతగిరి: తమ న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనాలు అములు చేయాలన్నారు. పోలీసులతో సమ్మెను అణచివేయాలనుకోవడం ప్రభుత్వ అవివేకమేనన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పంటమార్పిడితో అధిక దిగుబడి


వరిపంటను పరిశీలిస్తున్న శేఖర్

డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్

యాలాల: పంట మార్పిడి పద్ధతులతో అధిక దిగుబడి సాధ్యమని డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ అన్నారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని హాజీపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న వరి పంటలను ఆయన పరిశీలించారు. రైతులు సాగుచేసిన రుద్రూర్, వరంగల్ చిరుసంచుల రకాల ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే పంటు వరుసగా రెండుసార్లు సాగు చేయడంతో భూసారం తగ్గుతుందన్నారు. వరిపంట తర్వాత పెసర పంటలను సాగు చేస్తే భూసారం పెరిగి దిగుబడి పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. దీంతో దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రవీందర్, వీరప్ప, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

మలేరియాను తరిమికొడదాం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్

కొడంగల్ రూరల్: పరిసరాల పరిశుభ్రతను పాటించి మలేరియాను తరిమికొడదామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆస్పత్రి సిబ్బంది, మండల పరిధిలోని అంగడిరాయచూర్ పీహెచ్‌సీ సిబ్బంది ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా ర్యాలీల్లో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పరిసరాల్లో మురుగు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీరోజు డ్రై డేగా పాటించాలని.. దోమల నివారణకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అన్నారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిప్రసాద్, ఎంఎల్‌పీహెచ్‌లు డాక్టర్ అమృత, డాక్టర్ నిఖిత, సబ్ యూనిట్ ఆఫీసర్ ఫకీరప్ప, సూపర్‌వైజర్ సుశీల, ఎంపీహెచ్‌ఏ మధుసూదన్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


కొడంగల్ రూరల్: ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్

ముజాహిద్‌పూర్ గ్రామంలో..

కుల్కచర్ల: పారిశుద్ధ్యలోపం కారణంగా మలేరియా వ్యాధి ప్రబలుతుందని కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్, సీహెచ్‌ఓ చంద్రప్రకాష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం మండల కేంద్రంలో..

బంట్వారం: మలేరియా నిర్మూళనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సం సందర్భంగా మంగళవారం బంట్వారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ త్రివర్ణ, ఫార్మాసిస్టు అమరేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.